ప్రజాశక్తి



శుక్రవారం 18 ఏప్రిల్, 2025 5

శ్రీకాకుళం

22న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు 2, 4, 1, 7 స్థాయి, మధ్యాహ్నం మూడు గంటలకు 6వ స్థాయి, నాలుగు గంటలకు 3వ స్థాయి, సాయంత్రం ఐదు గంటలకు 5వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

- మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి
- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆప్కాస్‌ను రద్దు చేసి, దాని స్థానంలో తిరిగి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలైనా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఇంజినీరింగ్, కార్మికులు, ఎన్ఎంఆర్ బదిలీ, కోవిడ్ కార్మికులతో పాటు క్లాప్ డ్రైవర్లకు 36 జిఒ ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో 17 రోజుల పాటు కార్మికుల సమ్మె సమయంలో ప్రభుత్వం యూనియన్‌తో కుదుర్చుకున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా పెంపు, దహన సంస్కారాలు, సంక్షేమ పథకాల అమలు ఒప్పందాలకు సంబంధించిన జిఒలను వెంటనే జారీ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, కార్మికులు, ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. 60 ఏళ్ళకు బలవంతంగా తొలగించిన, అనారోగ్యం పాలైన, చనిపోయిన వారి కుటుంబ అవసరాల రీత్యా వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారంతో పాటు జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలని కోరారు. నగర పరిధిని దృష్టిలో పెట్టుకుని కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు.

పుష్ కాట్స్, బిన్‌లు, ఇతర పనిముట్లు వెంటనే అందించాలని, బళ్ల మరమ్మతులు చేయాలని, సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగర విస్తీర్ణ పరిధికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ధర్నాలో ఫెడరేషన్ నాయకులు, కార్మికులు కె.రాజు, ఎ.శంకర్, ఎ.మోహన్, ఆర్.యుగంధర్, డి.యుగంధర్, ఎ.రాజశేఖర్, ఎన్.పార్వతి, జె.మాధవి, ఆర్.ఈశ్వరమ్మ, ఎం.మల్లెమ్మ, ఇంజినీరింగ్ నాయకులు గిరిజాశంకర్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. లింగాలవలస, టెక్కలి ప్రాంతాల్లో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. లింగాలవలసలో రూ.2.30 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అదే గ్రామంలో రూ.18.60 లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ గోడ, రూ.6 లక్షలతో చేపట్టిన సిసి రహదారిని ప్రారంభించారు. టెక్కలి పట్టణంలో రూ.61 లక్షల అంచనా వ్యయంతో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోనే మోడల్ అన్నా క్యాంటీన్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం లింగాలవలసలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎల్.ఎల్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, బగాది శేషగిరిరావు, కోల లవకుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింహాచలం

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

శ్రీకాకుళం: జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు మూడు నెలలుగా కూలి డబ్బులు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాదరావు, గంగరాపు సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ జీతభత్యాలు రూ.లక్షలు పెంచుకుంటున్నారని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీల ఇబ్బందులను పరిష్కరించే శ్రద్ధ చూపించడం లేదన్నారు. ఉపాధి కూలీలు పనులు చేయకుండా డబ్బులు తీసుకుంటున్నారని పలువురు ప్రజాప్రతినిధులు తమ పెత్తందారీ స్వభావాన్ని వెళ్లగక్కుతున్నారన్నారు. పేదల ఓట్లతో అందల మెక్కిన వారు రాజభోగాలు అనుభవిస్తున్నారన్నారు. అటువంటి వారు పేదలపై చిన్నచూపు తగదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందని, అందువల్ల సకాలంలో వేతనాలు విడుదల చేయించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు కె.ఎర్రయ్య, భవానిపాల్గొన్నారు.

అమరావతి పేరిట 'రియల్' వ్యాపారం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలో ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే, అమరావతి పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుచరగణంతో కలిసి రూ.వేల కోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మునిగి తేలుతున్నారని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు ఆరోపించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడం లేదని విమర్శించారు. మరోవైపు అమరావతిని రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చేశారని, అక్కడ అంత డబ్బు ఖర్చు పెట్టడం వల్ల సమ్మిళితమైన అభివృద్ధి దెబ్బతింటుందన్నారు. అమరావతి నిర్మాణం పేరిట భారీ దోపిడీకి తెరలేపారని, దీనిపై మేధావులు నోరు మెదపకపోతే రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. రాజధాని కోసం రైతుల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారని, ఇప్పుడు అదనంగా మళ్లీ భూసమీకరణకు తెరలేపారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు జిల్లాకు ఇప్పటివరకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పలరాజు పచ్చని జీడి, కొబ్బరి తోటలను తొలగించి ఎయిర్‌పోర్టు కడతామంటున్నారని, దీనిపై ప్రజలు ప్రశ్నిస్తే జెండాలు పట్టుకుని వచ్చేస్తున్నారని మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేతోనైనా చర్చించకుండా, ప్రజలకు చెప్పకుండా ఎయిర్‌పోర్టు కట్టేస్తామని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా, వారి జీవనాన్ని శాశ్వతంగా దెబ్బతీసే చర్యలు సరికాదన్నారు. ఇతర నిబంధనలతో ముడి పెట్టకుండా వేట సాగించే మత్స్యకారులందరికీ మత్స్యకార భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే మత్స్యకారులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.



పరిశీలిస్తున్న నోడల్ అధికారి విశ్వేశ్వరరావు

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇవిఎంల భద్రతా ఏర్పాట్లపై మాసాంతపు తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఇవిఎం గోదామును రాష్ట్ర ఇవిఎం నోడల్ అధికారి కె.విశ్వేశ్వరరావు గురువారం పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. గోదాములో అమల్లో ఉన్న ట్రిపుల్ లాక్ విధానం, నిరంతర సిసి టివి పర్యవేక్షణ, భద్రతా వ్యవస్థలను, సిబ్బంది విధులు, హాజరును సమీక్షించారు. ఇవిఎంల భద్రత, రికార్డు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో వివిధ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై నమ్మకం కలిగేందుకు ఇటువంటి తనిఖీలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగపు అధికారులు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

జిల్లా పర్యటనకు వచ్చిన ఇవిఎం నోడల్ అధికారి విశ్వేశ్వరరావు కుటుంబసభ్యులతో కలిసి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వారిని ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం స్వామివారి సేవల్లో పాల్గొన్న ఆయనకు అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం అనివెట్టి మండపంలో స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు శోభనాద్రిచార్యులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఖాళీ చేయాల్సిందే

ఆఫ్‌షోర్ నిర్వాసితులతో ఆర్‌డిఒ వెంకటేష్



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయని, ఈ మేరకు గ్రామస్తులు ఈ నెలాఖరులోగా గ్రామాన్ని ఖాళీ చేయాల్సిందేనని, అందుకు గ్రామస్తులు ప్రభుత్వానికి సహకరించాలని ఆర్‌డిఒ జి.వెంకటేష్ కోరారు. మండలంలోని రేగులపాడులో ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వాసితులకు ఇళ్ల స్థలాలతో పాటు నష్టపరిహారం చెల్లించామన్నారు. ఎవరికైనా నష్ట పరిహారం అందకపోయినా, ఇతర ఏ సమస్యలు ఉన్నా వారం రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. రేగులపాడుకు చెందిన 18 మంది నిర్వాసితులకు అదనంగా నష్టపరిహారం వారి బ్యాంకు ఖాతాలో జమఅయ్యిందని తెలిపారు. జమైన మెత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. లేనిఎడల చట్టపరంగా వారి నుంచి డబ్బులు వసూలు చేస్తామన్నారు. ఆర్‌డిఒ మాట్లాడతున్న సమయంలో అంత మందికీ అదనంగా నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అలాగే 30 ఎకరాల సాగు భూముకు నష్టపరిహారం ఇవ్వలేదని, సుమారు 8 మందికి ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు కాని, నష్టపరిహారం కాని అందలేదని ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ అర్హులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామన్నారు. ఇళ్ల పట్టాలు కూడా మంజూరు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాసితుల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేవని, ఒక్కసారిగా గ్రామాన్ని 15 రోజుల్లో ఖాళీ చేయాలంటే ఎలా కుదురుతుందని కొంత మంది ప్రశ్నించారు. దీనిపై ఆర్‌డిఒ మాట్లాడుతూ 95 శాతం నిర్వాసితులకు ఇళ్ల స్థలాలతో పాటు నష్టపరి హారం చెల్లించామని తెలిపారు. ఒకరిద్దరికి మాత్రమే నష్టపరిహారం చెల్లించకపోవడంతో ప్రాజెక్టు పనులను అడ్డుతగలడం సమంజసం కాదన్నారు. ఇళ్ల నిర్మాణాలపైన కట్టిన ఇళ్లకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించడం కుదరని, ఈ విషయంపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు దృష్టిలో ఉందని, అలాగే ఉన్నతాధిఃకారుల దృష్టిలో కూడా పెట్టామని తెలిపారు. అనంతరం గోపీవల్లభాపురం నిర్వాసితులు కాలనీ పరిశీలించారు. ఆయనతో పాటు తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, వంశధార ఇఇ శేఖర్, డిప్యూటీ తహశీల్దార్ వాయిపవల్లి గిరిరాజు, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

'సహకార'ంలో సమన్వయం అవసరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సహకార రంగాన్ని బలోపేతం చేయాలంటే అన్నిశాఖల సమన్వయం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా 12 విభాగాల అధికారులతో గురువారం సమీక్షించారు. కేంద్రం ప్రకటించిన సహకార నామ సంవత్సరం కార్యక్రమాల అమలుపై కార్యాచరణను రూపొందించాలనే ఉద్దేశంతో సమీక్షించామన్నారు. ప్రతినెలా ప్రత్యేక కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో సహకార రంగంపై అవగాహనా కార్యక్రమాలు, శిక్షణలు, రికవరీ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. పిఎసిఎస్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సహకార శ్రేణుల మధ్య అవగాహన పెంపుపై దృష్టిసారించాలన్నారు.

సేవల విస్తరణపై చర్చ

రైతులకు, చిన్నవ్యాపారులకు, మహిళా సంఘాలకు అందే రుణ సౌకర్యాలు, డ్రాయింగ్ లిమిట్ల పెంపు, మద్దతు ధరలపై సమాచార ప్రచారం వంటి అంశాలపై శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి నగేష్, జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్‌రాజా, వ్యవసాయశాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి. ఆహార, పౌర సరఫరాలశాఖ, పశుసంవర్థక శాఖ, మత్స్యశాఖ, డిసిసిబి మేనేజింగ్ డైరెక్టర్, నాబార్డు డిడిఎం, ఎఫ్‌సిఐ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న పెంకి సురేఖను ప్రభుత్వం విశాఖ జిల్లా భీమిలికి బదిలీ చేసింది. కొన్ని రోజులుగా కళాశాలలో ఆమెపై తోటి ఉద్యోగులే ఫిర్యాదు చేస్తూ వచ్చారు. ఆ ఫిర్యాదులపై దఫదఫాలుగా విచారణ చేపట్టినా ఇంతవరకు ఎటువంటి చర్యలకు ఉన్నత విద్యా మండలి నుంచి రాలేదు. ఎట్టకేలకు ప్రభుత్వం ఆమెను భీమిలి డిగ్రీ కళాశాలకు బదిలీ చేస్తూ జిఒను జారీ చేసింది. ఈ జిఒ ఆధారంగా ఉన్నత విద్యా మండలి కమిషనర్ నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

మస్కట్‌లో చిక్కుకున్న జిల్లావాసులు



మస్కట్‌లో ఉన్న బాధితులు

ఇచ్ఛాపురం: పొట్ట కూటి కోసం మస్కట్ దేశానికి వెళ్లిన జిల్లాకు చెందిన ఏడుగురు అక్కడ చిక్కుకున్నారు. ఉన్న ఊరిలో ఉపాధి లేక కుటుంబాన్ని పోషించుకునేందుకు తప్పనిసరి పరిస్థితిలో విదేశాలకు వెళ్లిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. జీతాలు మాట పక్కనపెడితే, కనీసం మూడు పూటలా తినడానికి తిండి కూడా లేకుండా పస్తులు ఉంటున్నారు. క్షణమొక యుగంగా గడుపుతున్నారు. తమను స్వదేశానికి రప్పించాలని వేడుకుంటున్నారు. బాధితుల కథనం ప్రకారం... మస్కట్‌లో నజీమ్ అల్ సలాం ఇంటర్నేషనల్ కంపెనీలో వెల్డింగ్ పనుల కోసం కోటబొమ్మాళిలోని ఒక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు ఇచ్ఛాపురం మండలం ధర్మపురానికి చెందిన జానీ ఇచ్ఛాపురం మండలం బూర్జపాడుకు చెందిన దున్న కామరాజు, డొంకూరుకు చెందిన దున్న హేమసుందర్, జానకిరావు, కవిటి మండలంలోని జాడిపూడికి చెందిన పిలక భాస్కరరావు, ఆర్.బెలగాంకు చెందిన గుజ్జు జగదీష్, శ్రీకాకుళానికి చెందిన ఎ.రామకృష్ణ, దిబ్బవానిపేటకు చెందిన ఎంపాల రాజును సంప్రదించారు. మస్కట్‌లో నిర్మాణ పనుల్లో వెల్డింగ్ పనులు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని, జీతం కూడా ఎక్కువ వస్తుందని నమ్మబలికారు. దీంతో ఉపాధి కోసం మూడు నెలల కిందట అక్కడకు వెళ్లిన వీరికి మోసపోయినట్లు వెంటనే తెలిసింది. అక్కడ వీరి పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. వెల్డింగ్ పనులని చెప్పిన వీరికి అక్కడకు వెళ్లాక షిప్ క్లీనింగ్ పనులు అప్పగించారు. జీతాలు ఇవ్వడం లేదు సరికదా, మూడు పూటలా సరిగ్గా భోజనం కూడా పెట్టడం లేదు. కొన్నిసార్లు పస్తులు కూడా ఉంచి పనులు చేయిస్తున్న పరిస్థితి ఉంది. దీనిపై బాధితులు జానీని ప్రశ్నించగా, పొంతన లేని సమాధానాలు చెప్తున్నారు. దీంతో బాధితులు వారి కుటుంబసభ్యులకు ఫోన్‌లో తమ దయనీయ పరిస్థితులను చెప్పారు. తమ వారిని స్వదేశానికి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబసభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

న్యాయసేవలు అందరికీ అందాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గార: న్యాయసేవలు అందరికీ అందాలని, ఖైదీలు తమ హక్కులను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలును గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడిన ఆయన, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. న్యాయవాదుల సహాయం లేని ఖైదీలకు ప్రభుత్వ న్యాయవాదుల సేవల గురించి వివరించి, బెయిల్ పిటిషన్లు ఎలా దాఖలు చేయాలో అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులు, ఆహార నాణ్యత, జైలు పరిసరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. వచ్చే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో దీన్ని నిర్వహించనున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, జైలర్ దివాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఇబ్బందులు పునరావృతం కారాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. నగరంలోని వ్యవసాయశాఖ జెడి కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు విత్తనాలు, ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని సూచించారు. గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు. నియోజకవర్గంలో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పనిముట్లను వినియోగించుకునేలా, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, పశుసంవర్థక, మైక్రో ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుని రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి న్యాయస్థానం-టెక్కలి
H.M.O.P 30. 72/2023
(1955 హిందూ వివాహ చట్టంనకు సంబంధించిన అంశం)

దిగువ వారి మధ్యన :
కేతా మాధవ రావు
మరియు
1. కేతా రేవతి
2. బొర్రా షణ్ముఖ రావు ... ప్రతివాదులు

బొర్రా షణ్ముఖ రావు, S/o లేటు మారయ్య, నివాసం 12-126, రెడ్డిక వీధి, సీతానగరం గ్రామం, ఖస్పా నౌపడ, శ్రీకాకుళం జిల్లా. పై పేరు కలిగిన వాది హిందూ వివాహ చట్టం 13(1) (1-a) సెక్షన్ పరిధిలో విడాకులు (డైవర్స్) ఇప్పించవలసినదిగా ఒకటవ ప్రతివాది మీ పైన మరియు తెలిపిన పిటిషన్ వేసియున్నారు. కానీ మీరు అనగా రెండవ ప్రతివాది న్యాయస్థానం సమక్షమునకు హాజరు కావలసినదిగా నోటీసు రిజిస్టర్డు పోస్టు ద్వారా అదే విధంగా నజరత్ ద్వారా పంపినప్పటికీ న్యాయస్థానం ఎదుట హాజరై వాది యొక్క క్లయిం నకు సమాధానం ఇవ్వటంలో విఫలమైనారు. అందువలన మిమ్మల్ని నేరుగా న్యాయస్థానం సమక్షమునకు 25-04-2025న ఉదయం 10.30 గంటలకు హాజరై వాది యొక్క క్లయిం నకు సమాధానం చెప్పవలసినదిగా సూచించటమైనది. అట్లు చేయనిచో మీ పరోక్షమున కేసు విచారించి మరియు చట్ట ప్రకారం నిర్ణయించటం జరుగుతుంది.

పి.వైకుంఠరావు, అడ్వకేట్

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM
I.A.43/2025 in O.S.83/1999.

Between :-
Andhavarapu Laxmi .....Petitioner / Plaintiff
And :-
(1) Baratam Srirama Murty (Died),
(2) Baratam Tejeswari,
(3) Baratam Rajesh,
(4) Killamsetty Madhuri, (Respondents 2 to 4 are recognized as legal representatives Of deceased 1st respondent as per order in I.A.342/2024) ......Respondents.

To,
4th Respondent: Killamsetty Madhuri, W/o. K. Srinivasa Rao, R/at Door No. 111, Street No. 321, Mandala Veedhi, Srikakulam.

పై నంబరు పిటిషనులో పిటిషనరు specific relief Act సెక్షన్-28 క్రిందను పిటిషన్‌ను పై కోర్టులో దాఖలు చేయగా, సదరు పిటిషను 4వ **Respondent** అయిన మీకు నోటీసు నిమిత్తం **తే 21-04-2025 దీకి వాయిదా అయి వున్నది.** కావున సదరు వాయిదా నాడు **అనగా తే. 21-04-2025 దీ ని పగలు 10-30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందుమూలంగా తెలియ పరచడమైనది..

సూధా. సూర్యారావు
పిటిషనర్ తరుపు న్యాయవాది, శ్రీకాకుళం.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ విధానాలు కారణంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మికవర్గ ఐక్య పోరాటాలే సరైన మార్గమని సిఐటియు నాయకులు ఎన్.గణపతి అన్నారు. కాశీబుగ్గ అక్షర కళాశాల ఆవరణలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన గురువారం కార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కనీస హక్కులు కాలరాస్తూ... కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయని అన్నారు. కార్పొరేట్ల లాభాలకు కార్మిక చట్టాలే ఆటంకమని, వాటిని రద్దుచేసి లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల నెత్తిన బండ మోపారని అన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎం.లావణ్య, బి.నిర్మల, పి.భూదేవి మాట్లాడుతూ కార్మికులకు



మాట్లాడుతున్న గణపతి

కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస భద్రతా చట్టాలు కల్పించాలన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలన్నారు. మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధం అవుతున్నారని, కార్మిక వర్గం ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమ్మె ద్వారా ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో కాష్యూ యూనియన్ నాయకులు లండ ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.పద్మావతి, భవాని, ఎన్.నిర్మల, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు వై.మనమ్మ, పుణ్యవతి, ఆశా యూనియన్ నాయకులు పి.పార్వతి, ఐ. యజ్ఞ, ఎస్.లలిత, ఎన్.ద్రౌపది, ఎల్.పుణ్యవతి, స్కూళ్ల స్వీపర్ల యూనియన్ నాయకులు బి.స్వాతి పాల్గొన్నారు. అనంతరం సిఐటియు మండల కన్వీనర్‌గా లావణ్య, కమిటీ సభ్యులుగా ఎ.ఆనందరావు, బి.శశిరేఖ, ఐ.యజ్ఞ, బి.నిర్మల, ఎస్.లలిత, బి.తిరుపతి, కె.వెంకటి, టి.సింహాద్రి, బి.స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురుషోత్తపురం వద్ద సరిహద్దు చెక్‌పోస్టును ఎక్సైజ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఒడిశా నుంచి అక్రమంగా నాటుసారా, గంజాయి, మద్యం రవాణాపై గట్టి నిఘా పెట్టాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. మద్యం దుకాణాలు ఎటువంటి ఉల్లంఘనలు పాల్పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నవోదయం కార్యక్రమం విజయవంతంపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ పి.డి.ప్రసాద్, ఎస్ఐ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

ఓటు హక్కు నమోదు చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఏడాదిలో నాలుగు పర్యాయాలు ఓటు హక్కు నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆర్‌డిఒ గ్రంథి వెంకటేష్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం స్థాయిలో గురువారం నిర్వహించిన బిఎల్‌లకు ఓరియెంటేషన్ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిలో జనవరి, ఏప్రిల్, ఆగష్టు, డిసెంబరు నెల్లో ఓటు హక్కు నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో మృతి చెందిన వారి పేర్లను తొలగించారు. ఓటరు జాబితాలో తప్పు, ఒప్పులను గుర్తించి సవరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. బిఎల్‌ఓలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు కళ్యాణ చక్రవర్తి, హైమావతి, సీతారామయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ వాయిలపల్లి గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జనార్ధనరావు

'విశ్వశాంతి'కి ప్రశంసలు

పోలాకి: ఈ విద్యా సంవత్సరంలో అటల్ టింకరింగ్ ల్యాబ్, ఇన్నోవేషన్ మర్తాన్ ద్వారా శతశాతం బోధన పూర్తి చేసిన సందర్భంగా నీతి అయోగ్ ద్వారా ప్రసాంశ పత్రాలు అందినట్లు పాఠశాల కరెస్పాండెంట్ మెట్ట జనార్ధనరావు తెలిపారు ఈ మేరకు విశ్వశాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా పాఠశాలకు ప్రభుత్వం ఎటిఎల్ మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను నియమించి ఎక్కువ మంది విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే విధంగా తీర్చిదిద్దామన్నారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి 30 విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశామని తెలిపారు. ఇవి విద్యార్థులు భవిష్యత్‌కు బాగుంటుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎటిఎల్ ఇన్‌ఛార్జి శివసంతోష్ పాణిగ్రహి, ఉపాధ్యాయులు రమేష్ కుమార్, ఎం.అప్పలనాయుడు, రామినాయిడు, రంజిత పాల్గొన్నారు.

విద్యతోనే విలువైన జీవితం

లావేరు: విలువలతో కూడిన విద్యతోనే విలువైన జీవితం సాధ్యపడుతుందని మురపాక కెజిబివి ప్రిన్సిపాల్ బల్ల సుధ అన్నారు. గురువారం పాఠశాలలో లావేరు, జి.సిగడాం, రణస్థలం, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించి ఆమె మాట్లాడుతూ పరీక్షల్లో మార్కులే ముఖ్యం కాదని, భవిష్యత్‌లో ఎలా ఉండాలి, ఇప్పటి నుంచే ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. అలాగే మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సూర్యప్రభ మాట్లాడుతూ పది తర్వాత ఇంటర్ విద్యలోనే అప్రమత్తంగా ఉండాలని, అదేమనిషి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే సమయం అన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల పాఠశాలల ప్రిన్సిపాల్స్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఇఒ-1 జి.శ్రీరాములు అన్నారు. మండలంలోని లోలుగులో గురువారం అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ప్రయోజనాలను తెలియజేసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, హెచ్‌ఎం సంజీవరావు, సిహెచ్ విజయబాల, పిఎంసి చైర్మన్ ఇప్పిలి తిరుపతిరావు, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతిలక్ష్మి, భారతి, శోభారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

పారిశుధ్యంపై అవగాహన అవసరం

శ్రీకాకుళం రూరల్: సమాజంలో ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై అవగాహన ఉండాలని సర్పంచ్ ఎస్. సురేష్ అన్నారు. గార మండలం వాడాడ పంచాయతీలో గురువారం పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని శుభ్రపరచడం, వ్యర్థాలను నిర్వహించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని, పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు చేస్తుందన్నారు. చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. గ్రామంలో రోడ్లు, మురుగు కాలువలు, చెత్త నిర్వహణను పర్యవేక్షించారు. సచివాలయం నుంచి పాఠశాల వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల్లో చెత్తను వేయరాదన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నారాయణస్వామి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్.పి. నారాయణస్వామి తెలిపారు. పంచాయతీలోని బొగిడియపుట్టుగలో రూ.3 లక్షల పంచాయతీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో ప్రతి గ్రామానికీ మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిధులు కేటాయించినట్టు తెలి పారు. అన్నిరంగాల్లో పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్టు అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, ఉప సర్పంచ్ బి.మంగమ్మ, ఎస్.పి. ప్రవీణ్, భవానిస్వామి, చందు, కృష్ణ, ముకుంద పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి- పలాస

ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాటం చేయడమే కాకుండా బాధ్యతల కోసం కూడా పనిచేస్తున్న సంఘం యుటిఎఫ్ అని జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు అన్నారు కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి కె.రమేష్ అధ్యక్షతన పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండల ఉపాధ్యాయులతో గురువారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న ప్రయోగాల వల్ల విద్యా వ్యవస్థ దిగజారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కరోనా సమయంలో నాలుగు లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరారని, ఇప్పుడు 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలను విడిచిపెట్టి వెళ్లిపోయారని అన్నారు. దీనికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఒకే మీడియం పాఠశాలలను నిర్వహించడం, 3,4,5 తరగతులు హైస్కూళ్లలో కలపడం, ప్రభుత్వం పరిసర ప్రాంత పాఠశాలలను విలీనం చేయడం వంటి కారణాలతో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రయోగాలు చేయవద్దని, ప్రతి గ్రామంలోనూ ఒకటి నుంచి ఐదు వరకు ప్రాథమిక పాఠశాల ఉండాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో యూపి స్కూళ్లను కొనసాగించాలన్నారు. హైస్కూళ్లల్లో ఆరు నుంచి పది వరకు నడపాలన్నారు. రెండు మీడియంలో కూడా పాఠశాలలు నిర్వహించాలని తీర్మానించించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్‌వి.చలం, మండల అధ్యక్షుడు తమ్మినాన జయరాం, ప్రధాన కార్యదర్శి సిద్దు జనార్ధనరావు, పి.సంజయ్‌కుమార్, టి.అప్పారావు పాల్గొన్నారు.



మురుగు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికే పల్లె నిద్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని, ప్రజలతో మమేకమై రోజంతా వారితో గడిపి సమస్యలను తెలుసు కునేందుకు చక్కటి అవకాశమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని సీపన్నాయుడు పేటలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రాత్రి పల్లెనిద్ర చేపట్టిన ఆయన గురువారం ఉదయం సీపన్నాయుడుపేట, ఫాజుల్‌బాగ్‌పేట ప్రాంతాల్లో పర్యటించారు. సీపన్నాయుడు పేటలోని మురికినీటి సమస్య ప్రధానంగా ఉందని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. వీధుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే చెప్పారు. తాగునీటి పైపులు లేకపోవడంతో వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు వాటర్ వర్క్ అధికారులతో ఆయన చర్చించారు. భూసమస్యలు, విద్యుత్, కాలువలు, డ్రైన్లు, రోడ్లు వంటి వాటిపై ఫిర్యాదులను స్వీకరించిన ఆయన వీటికి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గణపతిరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉజ్వల భవిత

వ్యక్తిత్వ వికాస నిపుణుడు జాయి బిహాన్స్

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థుల్లో నిరంతరం జ్వలించే కాంక్ష, సాధించాలనే సంకల్పం ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులభతరమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జాయి బిహాన్స్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో కెరీర్ కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం విద్యార్థులతో మాట్లాడారు. విద్యా విజ్ఞానంతో పాటు సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే యువతకు ఉజ్వల భవిత సుసాధ్యమన్నారు. జీవితాలను విచ్ఛిన్నం చేసే డ్రగ్స్, మత్తు పదార్థాలపై యువత జాగృత వహించాలన్నారు. మానవీయతా దృక్పథంతో తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎంతో శ్రమతో బిడ్డల



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు జాయి బిహాన్స్

ఉన్నతిని ఆకాంక్షించే తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ముందడుగు వేసి ఉత్తములుగా ఎదగి సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ మెండ మోహనదాస్, డీన్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

రైతుల ఆదాయం పెంపే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతుల ఆదాయం పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక డిఆర్‌డిఎ, వెలుగు ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యాన సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ రాష్ట్రీయ కృషి వికాస యోజన సౌజన్యంతో రూ.15 లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు ఉత్పదారుల సంస్థ సేకరణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతుల వినియోగించుకోవాలని కోరారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం సేవలు జిల్లాకే ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురాడ మోహనరావు, పుచ్చ ఈశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, దున్న షణ్ముఖరావు, శశిభూషణ్, కొనారి కిరణ్‌కుమార్, రామకృష్ణ, ఎంపిడిఒ రమేష్‌నాయుడు, డిటి మురళీకృష్ణ, ఉద్యానవనశాఖ అధికారి సునీత, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ రామ్మోహన్ పాల్గొన్నారు.



రుద్రశెట్టి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రపురం జాతీయ రహదారి వద్ద గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం దిగపొండికి చెందిన రుద్రశెట్టి (23) మృతి చెందగా, మరో వ్యక్తికి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వగ్రామం నుంచి పలాస వైపు ద్విచక్ర వాహనంపై రుద్రశెట్టి, అతని స్నేహితుడు వెళ్తున్నారు. బేసిరామచంద్రపురం సమీపంలో వేగంగా వస్తున్న బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పక్క రహదారిపైకి బోల్తాపడడంతో ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రుద్రశెట్టి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బారువ ఎస్ఐ హరిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితులను ప్రవేశపెట్టిన సిఐ చిన్నంనాయుడు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి 10.500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితులను గురువారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన నరేష్ శెట్టి, గోపినాతన ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నట్టు వివరించారు. వారిని అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్ల, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డబ్బులకు ఆశపడి తక్కువ ధరకు ఒడిశాలో కొనుగుల చేసి వేర్వేరు ప్రాంతాలకు అధిక ధరలకు అమ్మకాలు చేపడుతున్నారని అన్నారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

బంగారం చోరీకి యత్నం

మందస : మండలంలోని సాంబకోట పంచాయతీ బిత్తరసాయిలో మల్లి అనే వృద్ధురాలి చెవును దుండగలు కోసేశారు. బుధవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తుండగా కారులో వచ్చిన దొంగలు మల్లి కుడి చెవిని కోసేశారు. చెవుకి ఉండే బంగారాన్ని చోరీకి యత్నించిన సమయంలో మల్లి మేల్కొని కేకలు వేసింది. వెంటనే దుండగలు కారులో పరారయ్యారు. చెరువు నుంచి రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు హరిపురం సిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పలాస : మండలంలోని అల్లుకోల-రెంటికోట గ్రామాల మధ్య గురువారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు తీవ్ర గాయాలయ్యాయి. రెంటికోట సచివాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్న బి.రవికుమార్ తన భార్య సంధ్యతో కలిసి గొప్పిలి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గొప్పిలి నుంచి పలాస వైపు వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు పలాసలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తోటాడలో ఈశ్వరమ్మకు చెక్కు అందజేస్తున్న ప్రమీల

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ఆమదాలవలస: సిఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. గురువారం ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో ముగ్గురికి సుమారు రూ.12 లక్షల చెక్కులను అందజేశారు. ఆమదాలవలస మండలంలోని తోటాడకు చెందిన బుడుమూరు మల్లేశ్వంరావు మరణించడంతో ఆయన భార్య ఈశ్వరమ్మకు రూ.77,517 చెక్కును, తురకపేటకు చెందిన మొయ్యి బాలాజీకి రూ.ఆరు లక్షల చెక్కును, సరుబుజ్జిలి మండలంలోని తురకపేటకు చెందిన చెంచల లక్ష్మికి రూ.4.50 లక్షల చెక్కులను ఆమె అంద జేశారు. .

సంతబొమ్మాళి తహశీల్దార్‌గా హేమసుందరరావు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి తహశీల్దార్‌గా బి.హేమసుందరరావు గురువారం నియమితులయ్యారు. ఈయన రణస్థలం మండలంలో సిఎస్‌డిటిగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈనెల 1న 'ఎన్నాళ్లీ ఇన్‌ఛార్జిల పాలన' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి తహశీల్దార్ నియామకానికి కృషి చేశారు.

సచివాలయాల తనిఖీ



బూర్జ : రికార్డులు పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అప్పల పట్నాయకునిపేట గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఆర్. తిరుపతి రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు, రికార్డు నిర్వహణ పరిశీలించారు. క్లస్టర్ వారిగా సర్వే రిపోర్ట్స్ సిబ్బందితో రివ్యూ చేశారు. సర్వేలను ఖచ్చితమైన సమాచారంతో పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే గ్రామాల్లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిశీలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.విజయలక్ష్మి, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: సచివాలయ విధులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండలంలోని వంజంగి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు, హాజరు పట్టికను తనిఖీ చేశారు. వర్క్ ఫ్రం హోం, హౌస్ హోల్డ్ జియో కో-ఆర్డినేట్స్ రైస్ కార్డుల ఇకెవైసి, మనమిత్ర వాట్సాప్ సర్వీసెస్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో సచివాలయ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను నియమించాలి

రణస్థలం: మండల కేంద్రంలోని గరికిపాలేం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, సీతంవలస ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులు ప్రభుత్వం తక్షణమే నియమించాలని ఆ ప్రాంత వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకొని, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారం అందించే ఆరోగ్య వారధులు ఆశ కార్యకర్తలన్నారు. గర్భిణులకు, బాలింతలకు మందులు అందించడం, ప్రభుత్వ వైద్యశాలల్లో డెలివరీ అయ్యేలా చూడడం, పిల్లలకు టీకాలు వేయించడం, మాతా శిశు మరణాలు తగ్గించడం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ దగ్గు, జ్వరం, జలుబు తదితర చిన్నపాటి వ్యాధులకు మందులు అందజేస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ రోగాల కట్టడికి చర్యలు చేపడు తుండేవారన్నారు. మహిళలు గర్భందాల్చిన నాటి నుంచి డెలివరీ వరకు ప్రతినెలా వారికి సూచనలు చేస్తూ సాధారణ ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించే వారిని, సర్కారు వైద్యశాలల్లో ప్రసవాలకు తీసుకుని వెళ్లి దగ్గరుండి ప్రసవాలు చేయించేవారన్నారు. గత నాలుగేళ్లగా ఆశవర్కర్లు లేక ఇటువంటి వైద్యసేవలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఈ రెండు కాలనీలకు, సీతంవలస గ్రామానికి ఆశా కార్యకర్తలను నియమించి ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

గొంతెండుతోంది పట్టించుకోరూ..

- నాలుగు రోజులుగా తాగునీటి కోసం అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

గ్రామంలో తాగు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నాం. పట్టించుకోరూ అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మామిడివలసలో గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తాగునీటికి అవస్థలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీరు సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే ఒకవైపు ఎండలు మరోవైపు తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. మంచినీటి కుళాయిల ద్వారా వస్తున్న తాగునీరు కనీస అవసరాలకు చాలడం లేదని అయితే ప్రస్తుతం నాలుగు రోజులు పూర్తిగా తాగునీరు సరఫరా కాకపోవడంతో కొట్టుమిట్టాడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న అధికారులు ఆ దశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. గ్రామంలో ఐదు బోర్లు



మరమ్మతులకు గురైన బోరు

ఉన్నప్పటికీ నాలుగు బోర్లు ఇప్పటికే మరమ్మతులకు గురై మూలకు చేరాయని, ఉన్న ఒక్కబోరు తాగునీటి అవసరాలకు ఉపయోగపడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని కార్యదర్శి అరుణను వివరణ కోరగా మోటారు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

జీడికి మద్దతు ధర దక్కేనా?

ప్రజాశక్తి- మందస

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఉద్దానం ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో జీడి పంట సాగు చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు 11706, మందస 9050, పలాస 7556, సోంపేట 5345, కంచిలి 1950 కవిటి మండలాల్లో 1185 ఎకరాల్లో పంట సాగు అవుతుంది. జీడి పిక్కలు ఎకరాకు 5 నుంచి 10 బస్తాల వరకు పంట వచ్చే పరిస్థితి. అయితే ఈ ఏడాది వాతావరణం మార్పుల వల్ల పూత దశలోనే నాశనమైంది. దీంతో పంట ఆశించినంత ఫలితం రాలేదు. వచ్చిన కొద్ది పంటలో కూడా అసంతృప్తి నెలకుంది. ప్రభుత్వం ఇప్పటి వరకు మద్దతు ప్రకటించలేదు. దీంతో ఉద్దానం రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. అరకొర వచ్చిన పంటను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని తరలించుకుపోతున్నారు. మరోపక్క రైతులకు అప్పులు ఇచ్చిన దళారులు గ్రామాల్లోకి రంగప్రవేశం చేసి వాళ్లకు నచ్చిన ధర ఇచ్చి ముందుగా పిక్కలు బస్తాలను తరలించకపోతున్నారు. రైతులు చేసేదేమీలేక అమ్ముకోవాల్సి వస్తోంది. నిల్వ ఉంచి ఎలుకల బెడద, పిక్కలు బూజు పట్టడం వంటి ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో రైతులు దళారులకు విక్రయించే పరిస్థితి నెలకుంది. అయితే ఎన్నికల సమయాల్లో ప్రభుత్వాలు మాత్రం ప్రధాన అస్త్రంగా జీడికి మద్దతు ప్రకటిస్తామని ప్రచారాల్లో వాడుకుంటున్నాయి తప్ప ఆచరణలో అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎమ్మెల్యే గౌత శిరీష, సిఎం చంద్రబాబు నాయుడు గతేడాది నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పలాసలో రైతులకు



జీడి పిక్కలు

హామీలు ఇచ్చారు. అందులో ఉద్దానంలో జీడి బోర్డు, జీడి పిక్కలకు మద్దతు ధర, నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వంటి వాగ్దానాలు ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. ఓ పక్క విదేశీ పిక్కలకు బాగా గిరాకీ పెరగడం, విదేశీ పిక్కలకు జిఎస్‌టి తగ్గించడంతో వాటిపై వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. దానివల్ల ఉద్దాన రైతులకు అధిక మొత్తంలో నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఇంతవరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష, ఎపి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు జీడి రైతుల పక్షాన మాట్లాడే సందర్భాలు లేవని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు దృష్టిసారించి జీడి పిక్కలకు మద్దతు ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సమన్యాయం కోసమే వర్గీకరణ

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుజువు చేశారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గతంలో రిటైర్డ్ జడ్జి రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, మంత్రుల కమిటీ ఇచ్చే నివేదికపై క్యాబినెట్లో చర్చించిందని వీటి ప్రకారం 200 పాయింట్ల రోస్టర్ అమలకు నిర్ణయించిందన్నారు. త్వరలో విడుదల చేయనున్న డిఎస్‌సి నోటిఫికేషన్‌తోనే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో నియోజక ఎస్‌సి సెల్ అధ్యక్షులు సారవకోట రామారావు, ఎంపిటిసి యాగాటి లక్ష్మణరావు, ఉర్లాడ రాంబాబు, వెలుగు శ్రీరాములు, కూన రమేష్, ఇల్లాకుల శ్యామలరావు, గుజ్జుపూర్ రామలక్ష్మి, సతివాడ నందేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు

తాగునీటి ఎద్దడిని నివారించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేనివిధంగా తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ నర్తు రామారావు కోరారు. మున్సిపాలిటీలో వైస్‌చైర్పర్సన్ ఛాంబర్‌లో వైస్‌చైర్పర్సన్ రాజ్యలక్ష్మితో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. 23 వార్డులో తాగునీటి సమస్య రోజురోజుకీ జటిలంవుతుందన్నారు. కలెక్టర్ చొరవ తీసుకోవాలి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో రైతు ఆత్మహత్యలు మొదలయ్యాయని అన్నారు. నదుల అనుసంధానం అత్యవసరం దీనివల్ల తాగునీరు, సాగునీరు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. నదులు అనుసంధానంపై ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. వంశధార నది జలాలను బహుదా నదికి అనుసంధానం చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది జీడి, మామిడి, పనస ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉద్దానం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రేమ్‌కుమార్, ప్రకాష్ పట్నాయక్, జగన్, లోకేష్, గాంధీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని మెట్టుపేటలో గురువారం ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్య పోషణ కార్యక్రమాల్లో విభాగాలు ఫార్మర్ న్యూట్రిషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటికి కావలసిన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. పెరటి తోటలో పండించుకున్న ఆహార పదార్థాలతో వాళ్లకి కిచిడీ తయారు చేసుకోవడం నేర్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, చిరుధాన్యాల ప్రాముఖ్యత, పెరటి తోటల ప్రాముఖ్యత గురించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఆరోగ్య పోషణ విభాగంలో ఎన్ఎఫ్ఎ యోగిత, హెచ్ఎన్ఎస్ఆర్‌పి రాజేశ్వరి, హెచ్ఎన్ఎన్ఎఫ్ రేణుక, కమ్యూనికేషన్ శ్రావ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

టెక్కలి : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని నివారించే క్రమంలో అవగాహన అవసరమని టెక్కలి అగ్నిమాపక అధికారి బి.సూర్యారావు అన్నారు. స్థానిక ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సందర్భంగా విపత్తులు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మల్లా మధులత పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి ప్రశాంత్‌కుమార్, సూర్యారావులు అవగాహన కల్పించారు. ఎన్ని రకాలు అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి... వీటి నివారణపై ప్రత్యక్షంగా ప్రదర్శన రూపేణా అవగాహన చేశారు. కొంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులను పిలిపించి భౌతికంగా వారితో చేయించారు. కార్యక్రమంలో ఎస్.నీలంలం, టి.కామరాజు, ఎన్.డి.ప్రసాద్, డి.ప్రసాద్, జి.వి.రమణ, కాశీనాథ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: అగ్నిమాపకవారోత్సవాలు భాగంగా స్థానిక


టెక్కలి : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

వంశధార విద్యా సంస్థలో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి పి.ఆర్.రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.రామారావు, విద్యా సంస్థల వ్యవస్థాపకుడు చింతాడ అనిరుద్రుడు పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి పైల అశోక్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను ఆర్పటంలో మెలకువలను, మంటల్లో చిక్కుకున్నప్పుడు తప్పించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రాక్టికల్‌గా మంటలను ఆర్పడంపై అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ సేఫ్టీ సంబంధించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ తేజబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ, నష్టాన్ని తగ్గించవచ్చునని ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి పి.అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో అగ్నిప్రమాదాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులు, ఆస్పత్రులతో పాటు పలు కూడళ్లలో ల్యాండ్‌ఫోన్ ద్వారా అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించవచ్చునని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎ.రామకృష్ణ, బి.ధర్మారావు, వెంకటేష్, గోరీశంకర్, చరణ్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పాతపట్నం

నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పాతపట్నం - తెంబూరు రోడ్డు, సింగుపురం-రట్టిపేట గ్రామాల వరకు రూ.1.60 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. గంగువాడలో రూ.లక్షలతో పూర్తి చేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సదుపాయం కల్పిస్తే అభివృద్ధి చెందుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, సైలాడ సతీష్, సిరిపురం గంగాధరరావు, బుద్దల నరేష్, బెజ్జిపల్లి నీలకంఠరావు పాల్గొన్నారు.

తొట్టెలు ప్రారంభం

మండలంలోని సింగుపురంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పశువుల తాగునీటి తొట్టెలను ప్రారంభించారు. వేసవిలో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో నీటి సమస్య తలెత్తనుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తొట్టెలను ప్రభుత్వం నిర్మిస్తుందని


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మంచు కరుణాకరరావు, ఎపిఎం రవి, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

మండలంలోని బొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చక్కగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు త్రినాధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి అభినందనలు

ఇచ్ఛాపురం : కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్స్-2025 జాబితాలో స్థానం లభించడం హర్షణీయమని పట్టణ టిడిపి లీగల్ సెల్ ప్రతినిధి నాగరాజు పాత్రో అన్నారు. చిన్న వయసులో ఎల్లలు లేని కీర్తిని కూడగట్టుకుంటున్న యువ నాయకుడిగా యువతకు ఆదర్శవంతంగా నిలుస్తున్నారని అన్నారు. పరిపాలనలో ప్రజా సేవానందన్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్న తీరు, చిత్తశుద్ధి, నిబద్ధత ఆధారంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ యంగ్ లీడర్స్ 2025 జాబితాలో చోటు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.


నాగరాజు పాత్రో


మాట్లాడుతున్న జడ్జి మాధురి

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

పలాస : స్థానిక సివిల్ కోర్టులో మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సివిల్ జడ్జి యు.మాధురి కోరారు. స్థానిక కోర్టులోన్యాయవాదులతో, పోలీసులతో, ఎక్సైజ్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీ పడదగ్గ కేసులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణ, ఎపిపి రమేష్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.ఆర్.పట్నాయక్, సెక్రటరీ కాళిదాసు, జాయింట్ సెక్రెటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, లైబ్రరీన్ కోత రజనీకుమార్, జి.ప్రభాకరరావు, రవికుమార్, శ్యామ్, ఎక్సైజ్ సిఐ మల్లికార్జునరావు, కాశీబుగ్గ ఎస్ఐ మెట్ట చంద్రరావు, వజ్రపుకొత్తూరు ఎఎస్ఐ జిన్నారావు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు సముచిత స్థానం


మాట్లాడుతున్న అప్పారావు

ఆమదాలవలస : కూటమి ప్రభుత్వ హయాంలో ఎస్‌సిలకు సముచిత స్థానం కల్పించడం ఆనంద దాయకమని మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎస్‌సి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఎస్‌సి ఉప వర్గీకరణకు సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. రాష్ట్రాల వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని దాంతో సిఎం చంద్రబాబు ఎ, బి, సి, డి వర్గీకరణకు ఆమోదం తెలిపారన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ ఎస్‌సిల కు సముచిత స్థానం కల్పిస్తూ పెద్దన్న పాత్ర పోషిస్తున్నా రన్నారు. వర్గీకరణ జరిగిన తరువాత డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఆలోచించడం ఎస్‌సిలకు ప్రయోజనకరమని చిత్తశుద్ధి ఏమిటో రుజువైందన్నారు. కార్యక్రమంలో దళిత మైనార్టీ క్రిస్టియన్ వైస్ చైర్మన్ రాడ విజయ్ కుమార్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు తోట రాము, దళిత నాయకులు గుర్రాల చిన్నబాబు, గొల్లపల్లి సింహాద్రి, పొన్నాడ అప్పలసూరి, నవిరి చిన్నారావు, పెంకి రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'అన్న క్యాంటీన్'కు స్థల సేకరణ

నరసన్నపేట: పేదవారి ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట రోడ్లు భవనాల అతిథిగృహంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, సంబంధిత మండల అధికారులతో గురువారం సమీక్షించారు. ప్రధానంగా రాజుల చెరువు అభివృద్ధి, సుందరీకరణ, అన్న క్యాంటీన్ స్థల సేకరణ సమీక్షించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి జామి వెంకటరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు పాల్గొన్నారు.

వాహనాల దారిమళ్లింపు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని బెల్లుపడలో శుక్రవారం నిర్వహించనున్న తారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం సందర్భంగా ఉదయం 10 నుంచి ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటల వరకు పోలీసులు దారిమళ్లించామని టౌన్ ఎస్ఐ ముకుందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహాయజ్ఞం దృష్టా భారీగా జనసంచారం, వాహనాల రాకపోకలు సాగించే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా వాహనాలను మళ్లించామన్నారు. హైవే వద్ద స్కై డ్రాప్ కూడలి నుంచి ఇచ్ఛాపురం పట్టణంలోని భారీ వాహనాలకు అనుమతి లేదన్నారు. బస్సులు, లారీలు, సుమండి మీదుగా ఎ.ఎస్.పేట లోపల నుంచి పట్టణంలోనికి ప్రవేశించాలన్నారు. ఇచ్ఛాపురం నుంచి స్కై డ్రాప్ కూడలి వైపు వెళ్లాల్సిన వాహనాలు ఎ.ఎస్.పేట నుంచి సుమండి మీదుగా వెళ్లాలని తెలిపారు.

సాత్విక్‌కు అభినందనలు

సోంపేట : పట్టణంలోని సంస్కార భారతి విద్యాసంస్థల్లో ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థి సాత్విక్ యూనియన్ బ్యాంక్ పిఒగా ఎంపికైనట్లు కళాశాల యజమాన్యం తెలిపింది. ఈ మేరకు గురువారం సాత్విక్‌ను కళాశాల యజమాన్యం సత్కరించి అభినందనలు తెలియజేసింది.


అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

'తెప్పల'కు కళాభారతి పురస్కారం

పలాస : స్థానిక జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి కళాభారతి పురస్కారం లభించింది. విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి 20వ వార్షిక రాష్ట్ర ఆహ్వాన నాటికల పోటీల ముగింపోత్సవం, తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాభారతి ప్రోగ్రామ్ కమిటీ అధ్యక్షులు మంతెన సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్, మహారాజ పోషకులు విశాఖ పైడా విద్యా సంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ ఈ పురస్కారాన్ని అందజేశారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన

రణస్థలం: నేత్రాల ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రంలోని కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 65 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 17 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైందని, మన కళ్లను సంరక్షించుకోవడం మన బాధ్యతన్నారు. కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పని చేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, అలాగే కంటి రెప్పలను ఆడిస్తుండాలన్నారు. అలాగే కళ్లను తరచుగా చేతితో తాకడం మంచిది కాదన్నారు. క్యారెట్, తాజా పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్డులోని పచ్చసొనల్లో విటమిన్ ఎ ఉంటుందని ఇది కంటి ఆరోగ్యానికి మంచిదన్నారు.

మట్టి నమునాల సేకరణ వేగవంతం

కోటబొమ్మాళి: మండలంలో 27 రైతు సేవా కేంద్రాల నుంచి 1667 మట్టి నమూనాలను సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎఒ ఎస్.గోవిందరావు అన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా మండలంలోని చిట్టవలస పంచాయతీలో గురువారం ప్రారంభించారు. మండలంలో సేకరించిన మట్టి నమునాలను ఆముదాలవలస భూసార పరీక్షా కేంద్రానికి పంపించామన్నారు. కార్యక్రమంలో చిట్టేవలస విఎఎ టి.శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని రైతుల పొలాల నుంచి మట్టి నమూనాల సేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎఒ నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని నూకలూరులో మట్టి నమునాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేల ఆరోగ్య పత్రం పథకం కింద మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎనిమిది వందల యాభై రెండు యూనిట్ల మట్టి నమూనాలను సహకరించేందుకు లక్ష్యంగా నిర్ధారించామన్నారు. చెట్లు నీడ, పశువుల మల విసర్జన పదార్థాలు ఉన్న ప్రాంతాల్లో కాకుండా ఖాళీగా ఉన్న పంట భూముల నుంచే మట్టి నమూనాలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు డి.సత్యం, ఎన్.పున్నయ్య, సిబ్బంది పవిత్ర, ప్రకాష్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు స్పందన

ప్రజాశక్తి- కవిటి

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై గురువారం మండల స్థాయి చిత్రలేఖనం పోటీలు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్టు ఎంఇఒ ధనంజయ మజ్జి తెలిపారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెలగాంకు చెందిన జి.రోషిని ప్రథమ బహుమతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కవిటికి చెందిన దుద్ధి లిఖిత ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాబేళ్ల సంరక్షణపై ప్రతి విద్యార్థికీ అవగాహన అవసరమని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బెందాళం మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ పాఠశాలలో ఆలివ్ రిడ్లీ సముద్ర తాబేళ్ల సంరక్షణ అంశంపై మండలస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో ఎల్.సుకీర్తి, ఎల్.చాందిని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.తిరుమలరావు, రొంపివలస జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం కుమార్‌స్వామి, ఉపాధ్యాయులు అప్పలరాజు, నల్ల తారకరామారావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించి మండల స్థాయి చిత్రలేఖనం పోటీల్లో నలుగురు విద్యార్థులు విజయం సాధించి జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికయ్యారని ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ తెలిపారు. ఆలివ్ రిడ్ లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన నిమిత్తం నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని నీలంపేట జిల్లా పరిషత్ పాఠశాల నుంచి అన్నెపు ఝాన్సీ, కోటబొమ్మాళి జెడ్‌పి ఉన్నత పాఠశాల నుంచి నందిగాం నవ్య, కోటబొమ్మాళి జెడ్‌పి బాలికోన్నత పాఠశాల నుంచి ఆర్.రమ్య, ఎంజెపి బాలుర రెసిడెన్షియల్ స్కూల్ నుంచి బి.భగవాన్‌లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు డి. గోవిందరావు, ఉపాధ్యాయులు జి.పాపారావు, కె.భాస్కర్‌లు పాల్గొన్నారు.


పాతపట్నం : వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న 7,500 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతి కల్పించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నగరంలోని క్రాంతి భవన్‌లో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలకాని స్కూళ్లపై ప్రభుత్వం పూర్తి దృష్టి సారించాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కూడా విద్యావాలంటీర్లు నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 117 రద్దుతో కూడిన సవరణలు అమల్లో భాగంగా మూడు, నాలుగు తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి తిరిగి సమీప ప్రైమరీ పాఠశాలకు తీసుకురాకుండా అక్కడే ఉంచి స్కూల్ అసిస్టెంట్లతో కొన్నాళ్లపాటు బోధన చేయించాలన్న ఆలోచన సరికాదన్నారు. ఒకటి రెండు తరగతులకు కూడా ప్రవేశాలు కల్పిస్తున్న సమయంలో ఈమార్పుల ప్రభావం స్కూళ్లపై పడుతోందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, చింతల రామారావు, కూన శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, ఎన్.లక్ష్మణరావు, ఎం.మురళీధర్, చౌదరి జగన్, ఎం.తేజ, జి.తిరుమలరావు, డివిఎన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఎగువబగడలో సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ టెక్కలి సిబ్బంది, బాణాపురం సచివాలయ మహిళా పోలీస్ స్వాతి ఆధ్వర్యాన నాటుసారా తయారీ స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. టెక్కలి ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ మాట్లాడుతూ ఈ దాడుల్లో 800 లీటర్లు పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేశామని తెలిపారు. అనంతరం గ్రామస్తుకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియజేశామన్నారు. తయారీ కోసం బెల్లం ఎవరి దగ్గర నుంచి తెచ్చారో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. ఈ దాడుల్లో కార్యదర్శి పోలాకి మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మందస : మండలంలో సాబకోటలో సోంపేట ఎక్సైజ్ ప్రొఫెషన్ సిఐ కె.బేబీ నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించిన నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. అనంతరం 20 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

పాతపట్నం : మండలంలోని చాపరాయిగూడ కొండ ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ సిఐ కె.కృష్ణారావు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారికి సిద్ధంగా ఉనన 200 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది వాసుదేవరావు, శివ పాల్గొన్నారు.

అద్దెకు యంత్ర పరికరాలు

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం రాయితీపై అందించిన యంత్ర పరికరాలను రైతులు ఉపయోగించుకోవాలని ఎఒ పిరియా శ్రీదేవి సూచించారు. మండలంలోని బెలగాం, డి.జి.పుట్టుగ, కవిటి-2, బొరివంక, మాణిక్యపురం గ్రామాల్లోని సిహెచ్‌సిలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించిన యంత్ర పరికరాలు సిహెచ్‌సిల్లో అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. దీనిద్వారా రైతులు లబ్ధిపొంది తమ వ్యవసాయ పనులు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయా గ్రామాల విఎఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


యంత్ర పరికరాలు తనిఖీ చేస్తున్న ఎఒ శ్రీదేవి

ఉపాధి పనులు ప్రారంభం

పొందూరు: మేజర్ పంచాయతీ పొందూరులో ఉపాధిహామీ పనులను గురువారం టిడిపి పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగనాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్ద చెరువులో పనులను ప్రారంభించి, రెండు పూటలా పనులకు హాజరుకావాలని, తద్వారా అధిక వేతనాన్ని పొందాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు ప్రారంభిస్తున్న శ్రీరంగనాయకులు

తాగునీటి బోరుకు మరమ్మతులు

ఆమదాలవలస : మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పాఠశాల వద్ద ఉన్న మంచినీటి బోరును సర్పంచ్ ప్రతినిధి చల్ల కామేశ్వరరావు ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గడచిన కొన్నాళ్లుగా తాగునీటి బోరు మరమ్మతులకు గుర్రై మూలకు చేరడంతో వేసవి కాలం గ్రామస్తులు ఇబ్బందులు పడడం ఆయన దృష్టికి వెళ్లడంతో గురువారం బోరు మెకానిక్‌లతో బాగు చేయించి వాడుకలోకి తీసుకు వచ్చారు. తాగునీటి బోరును వాడుక లోకి తీసుకురావడంతో గ్రామ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ప్రతినిధి కామేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్ల సింహాచలం, గ్రామస్తులు పాల్గొన్నారు.


మరమ్మతులు చేయిస్తున్న కామేశ్వరరావు

విద్యార్థులకు మెడల్స్ అందజేత

శ్రీకాకుళం : నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన మూడేళ్ల వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను గురువారం అందజేశారు. కాళాశాల ప్రిన్సిపాల్ డా. కె.సూర్య చంద్రరావు హాజరై విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు ఆటపాటల్లో రాణించాలని సూచించారు. ఉన్నత స్థానాలను అందుకుని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ప్రతి అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ పద్మావతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ మోహన్ రాజు, కామర్స్ అధ్యాపకులు లలితా బాయ్, సంతోషి పట్నాయక్, పావని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని జగతి 11 కెవి లైన్ జంగిల్ క్లియరెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లండారిపుట్టుగ, కొండిపుట్టుగ, కొత్తపుట్టుగ, ఇంటెనుక పుట్టుగ, శిలగాం గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సోంపేట : మండలంలోని కొర్లం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి ఉద్దానం ఫీడర్లో శుక్రవారం ఉదయం 8 నుంచి నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ ఎఇ జి. యజ్వేశరరావు తెలిపారు. రూరల్ ఫీడర్ మెయింటెనెన్స్ కోసం జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. బారువ, గొల్లగండి, సిహెచ్.గొల్లగండి, బారువ కొత్తూరు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు వినియోదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సర్వేపల్లి వర్ధంతి

కవిటి : గురువులకే గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతి పాఠశాలలో గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి జీవిత విశేషాలు, దేశానికి ఆయన చెందిన సేవలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎఒ రాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీరు సరఫరా

పలాస : ప్రతి వార్డులో ట్యాంకుల ద్వారా సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అధికారులు, కాంట్రాక్టరు, సిబ్బందికి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో నీటి ఎద్దడి నివారణపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్న తీరును ఎప్పటికప్పుడు నా దృష్టికి తీసుకురావాలన్నారు. నీటిని వార్డుల్లో సరఫరా చేసే సమయంలో వార్డు కౌన్సిలర్లకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు.

తప్పిన ప్రమాదం

టెక్కలి : మండలంలోని కె.కొత్తూరు గ్రామ జాతీయ రహదారిపై గురువారం రాత్రి ప్రమాదం తప్పింది. పలాస నుంచి శ్రీకాకుళం వైపు బంగాళదుంపలు, ఉల్లిపాయలు లోడుతో లారీ వెళ్తుంది. ఒక్కసారిగా బ్రేక్ ఫెయిల్ కావడంతో డ్రైవర్ అప్రమత్తమైన డ్రైవర్ రోడ్డుకి అడ్డంగా నిలిపివేశారు. వెనుక వచ్చిన వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకి అడ్డంగా నిలిచిన లారీని యంత్ర సహాయంతో పక్కకి తరలించి ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించాల్సి ఉంది. అర్ధరాత్రయినా ట్రాఫిక్ నియంత్రణ జరగవచ్చని భావిస్తున్నారు.

బంగారు భవిష్యత్‌ను కాపాడుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

సామాజిక మాధ్యమాలు, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు దుర్భరం చేసుకోవద్దని, ఉన్నత లక్ష్యాలు, మంచి నడవడికతో బంగారంలాంటి భవిష్య త్ తీర్చిదిద్దుకోవాలని ఎస్ఐ బి.రవివర్మ సూచించారు. మత్తు పదార్థాలు - సామాజిక వ్యసనాలపై కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యార్థుల్లో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగి ఆత్మన్యూన్యతకు గురవుతున్నట్టు తెలిపారు. దీంతో వారిలో భావోద్వేగాలు పెరిగిపోయి ఆత్మహత్యల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. అదే సమయంలో మరికొంతమంది మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. జీవితంలో అలవాటు చేసుకునే క్రమశిక్షణ, మంచి నడవడిక విద్యార్థులకు మంచి జీవితానికి మార్గాలని సూచించారు. చెడు వ్యసనాల వైపు దృష్టి సారించకుండా ఉన్నత చదువులు అభ్యసించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయులు బెందాళం మల్లేశ్వరరావు, లింగరాజ్‌ప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.